## రొట్టెల పండుగలో సౌకర్యాలను పర్యవేక్షించిన జేసీ, కమిషనర్, అసిస్టెంట్ కలెక్టర్



**నెల్లూరుటౌన్ / నెల్లూరు కార్పొరేషన్, జూలై 29,** ప్రభాతవార్త: ప్రసిద్ధిగాంచిన నెల్లూరు దర్గామిట్టలో వెలసియున్న బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తొలిరోజు అందుతున్న సౌకర్యాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరిలు శనివారం పర్యవేక్షించారు. ఐదు రోజుల పాటు జరగనున్న పండుగకు పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు దర్గా ప్రాంగణం, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు తీర ప్రాంతంలో అన్ని వసతులను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్తులకు మంచినీటి వసతి, షామియానాల ఏర్పాటు, పోలీసుల నిఘా అంశాలను వారు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంతో పాటు ఇతర హాస్పిటల్స్ స్వచ్ఛంధంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక వైద్య శిబిరాల్లో భక్తులకు అవసరమైన మందులు, ప్రథమచికిత్స, అంబులెన్స్ సౌకర్యం, ఇతర వైద్య సదుపాయాలను అందించేలా అన్ని జాగ్రత్తలు వహించాలని వారు సూచించారు. జన సందోహంలో తప్పిపోయిన చిన్నారులు, వృద్ధులు, కుటుంబసభ్యుల సమాచారాన్ని నిరంతరం కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా ప్రచారం అందించి తప్పిపోయిన వారిని కుటుంబసభ్యులకు క్షేమంగా అప్పగించాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా జాగ్రత్తలు వహించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర ప్రమాదకర విద్యుత్ ఉపకరణాలు ఉన్న ప్రాంతాలకు భక్తులు రాకుండా పహారాకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని వారు సూచించారు. రొట్టెలు మార్చుకునే స్వర్ణాల తీరం వెంబడి చిన్నారులు నీళ్లలో లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, కమిషనర్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని రొట్టెల పండుగ నిర్వహణను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈత కొలనుల్లా జగనన్న ఇళ్ల లేఅవుట్‌లు



**నెల్లూరు, జులై29 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురం జనార్ధన్‌రెడ్డి కాలనీలో నిర్మిస్తున్న జగనన్న ఇండ్ల లేఅవుట్స్, ఇండ్ల నిర్మాణ పరిస్థితులను జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌చెన్నారెడ్డి నగర అధ్యక్షుడు దుగ్గిశెటి సుజయ్‌బాబుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మనుక్రాంత్ చెనా న్నరెడ్డి మాట్లాడుతు నగరంలో కురిసిన కొద్ది పాటి వర్షానికే ఈ లే అవుట్‌లో వర్షపునీరు నిలిచిపోయి ఈత కొలనున్నాల్లా దర్శిమనిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే 80శాతం మేర ఇండ్లు పూర్తిచేశామని బాకాలు ఊదుకుంటుందన్న అధికార పార్టీనాయకులు వాస్థవాలను విస్తరించారని, ఇక్కడ కేవలం 25శాతం పనులు కూడా పూర్తికాదేలన్నారు. పనులు పూర్తి కావచ్చిన కొద్ది పాటి ఇళ్లు కూడా పూర్తి నాశిరంగా ఉన్నాయని, వీటి నిర్మాణానికి వినియోగించిన వస్తువులు పూర్తి నాశికరంగా ఉన్నాయన్నారు. పునాదుల వరకు పూర్తిచేసుకున్న ఇళ్ల నిర్మాణం ఆగిపోవటంతో ఆయా నిర్మాణాల్లో పిచ్చి మెక్కలు మెలిచాయన్నారు. కొద్ది పాటి వర్షానికే ఇలా నీరు నిలబడుతుంటే ఇంక భారీ వర్షాలు కురిస్తే ఈ కాలనీల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ప్రజలను కాపాడాలని, నాణ్యమైన ఇండ్లను నిర్మించి ప్రజలను అందించాలని కోరారు. లేకుంటే తమ పార్టీ ఆద్వర్యంలో ఆందోళణ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం లేఅవుట్‌లలో జరుగతున్న అవినీతిని ప్లకార్డ్స్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, షేక్ ఆలియా, సుందరామ్‌రెడ్డి, వెంకటరమణ, కరీం, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదాని వరల్డ్ స్కూల్‌లో ఘనంగా భాషా వారోత్సవాలు




**ముత్తుకూరు, జూలై29, ప్రభాతవార్త** ఆదాని వరల్డ్ స్కూల్ గత వారం రోజులుగా భాషా వారోత్స వాలను నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన భాషలైన తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో అనేక అంశాలలో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సిరియాల సత్యనారాయణ బహుమతులతో పాటు సర్టిఫికెట్స్‌ను అందించారు. ముఖ్యంగా విద్యార్థులకు పాటలు ఏకపాత్రాభినయంతో పాటు నాటక రూపాలను ప్రదర్శించారు. అలాగే కథల పోటీలు వ్యాసరచన పోటీలు విద్యార్థులు ఆయా భాషల్లో ప్రావీణ్యం పొందేందుకు ఆదాని వరల్డ్ స్కూల్ ప్రాధాన్యత ఇస్తుందని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.

## లోక్‌సభ ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నా- వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, జూలై29, ప్రభాతవార్త** రానున్న ఎన్నికల్లో లోక్‌సబ ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. నెల్లూరు రూరల్ 12వ డివిజన్ వావిలేటిపాడులో ఎంపీ రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు అవుతున్నాయని, సంక్షేమ పథకాల పట్ల అభివృద్ధి పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానిక అభివృద్ధి పనుల కోసం రూ.40లక్షల రూపాయల నిధులను కేటాయించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఘన విజయం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని ఆకాంక్షించారు. అనంతరం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో రాజకీయ అనుభవంతో పరిపాలన పట్ల అనుభవంతో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ ఎమ్మెల్యేగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణ వెంకయ్య, స్థానిక నేతలు, అభిమానులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నారా లోకేష్ యువగళం 169వ రోజు పాదయాత్రలో మాలేపాటి



**కావలి, జులై 29 ప్రభాతవార్త** ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలో 169వ రోజు కొనసాగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో శనివారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్నారు. నారా లోకేష్‌తో కలిసి నడిచారు. నారా లోకేష్‌తో మాలేపాటి కొద్దిసేపు ముచ్చటించారు.








## ప్రారంభమైన బారాషహీద్ రొట్టెల పండుగ

బారాషహీద్ దర్గా వద్ద స్వర్ణాల చెరువులో రొట్టెల పండుగ శనివారం లాంఛనంగా ప్రారంభమైంది. తొలిరోజే వివిధ ప్రాంతాల నుండి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ రొట్టెల పండుగకు కులమతాలకతీతంగా అన్ని వర్గాల వారు ఈ పండుగలో పాల్గొని కోర్కెలు కోరుకుంటూ రొట్టెలు మార్చుకుంటారు. వరాల రొట్టె కోసం భక్తులు పోటీపడతారు. శనివారం రోజు సుమారు లక్షమంది భక్తులు వచ్చినట్లు అంచనా. కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీతిరుమలేశ్వర్ రెడ్డి, జిల్లా అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందిలేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 5 రోజులపాటు రొట్టెలపండగ వేడుకగా జరగనుంది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటుచేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. టీటీడీ బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సాయంత్రం దర్గాను దర్శించుకున్నారు.

ఫోటోలు: నందా మాల్యాద్రి



# తాగునీరు అందించడం నా అదృష్టం



**నెల్లూరు జూలై 29, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన పెద్దాసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబసభ్యులకు తాగునీరు అందిచటం నా అదృష్టంగా భావిస్తున్నానని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లోక్‌సభ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఎం హరినారాయణన్‌లు ప్రారంబించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న అన్ని తాగునీటి ప్లాంట్లను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహణ ఖర్చులు భరిస్తామన్నారు.

విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 110 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని, అంతేకాకుండా వాటిని సక్రమంగా మెయింటెనెన్స్ కూడా చేస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్, కోవిడ్ సమయంలో పది లీటర్ల కాన్సన్‌ట్రేటర్లు 100 ఇచ్చామన్నారు. కలెక్టర్ జీజీహెచ్‌లో ఆర్వో ప్లాంటు అవసరమని అడిగిన వెంటనే ఏర్పాటుకు అంగీకరించామన్నారు. ఆర్వోప్లాంటుకు తనకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియచేశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే ఫౌండేషన్ ద్వారా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, వేమిరెడ్డి దానగుణం కలిగిన వ్యక్తని కొనియాడారు. హరినారాయణన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో సమస్యల పరిష్కారానికి అందరం సంయుక్తంగా కృషి చేస్తున్నామన్నారు. వేయి పడకలు కలిగిన జీజీహెచ్‌కి తాగునీటి కొరత ఉందని చెప్పిన వెంటనే స్పందించి ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసినందుకు వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఓపి వద్ద 1000లీటర్ల ఆర్వోప్లాంటు, దయాలసిస్ యూనిట్ వద్ద నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో అక్కడ మరో 1000లీటర్ల ఆర్వోప్లాంటు, మరో 2000లీటర్ల ప్లాంటును ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ జమున, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ కాకుటూరి లక్ష్మీసునంద, విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, చిరంజీవిరెడ్డి, పలువులు వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# మాలకొండ ఆదాయం రూ.9.56లక్షలు



**వలేటివారిపాలెం జూలై 29, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. ఈ శనివారం సా ్వమివారికి రూ.9,56,222లు మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రధాన అర్చకులు గౌరీశంకర్, నరసింహాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.10,600లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.25,3200లు, వివాహాలు వలన రూ.1000లు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.50,150లు, వాహనపూజల వలన రూ.5,980లు, ప్రత్యేకదర్శనం రూ.3,06,300లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.820లు, రూముల అద్దెలు రూ.27,830లు, కవర్లు అమ్మకం వలన రూ.8400లు, అన్నదానం నిమిత్తం రూ.3,56,612లు లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,62,010లు, విరాళాలు వలన రూ.1200లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు భక్తులకు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**లడ్డు ప్రసాదం అందక భక్తుల ఆవేదన:**

స్వామివారి ప్రాంగణంలో భక్తులుకు అందచేసే లడ్డుప్రసాదం మద్యాహ్నం 1గంటకే అయిపోవడంతో భక్తులు స్వామివారి ప్రసాదం అందలేదని ఆవేదన చెందారు. భక్తులు దర్శనాంతరం స్వామివారి ప్రసాదాన్ని ఇంటికి తీసికెళ్లి కుటుంబసభ్యులకు అందచేయడం ఆనవాయితీ. ఇందులో బాగంగా ఇక్కడి లడ్డుకి ప్రత్యేకత ఉంది. సరాసరిన రెండున్నర క్వింటాల్ లడ్డు అమ్ముడుపోతుందని పలువురు అనుభవపూర్వకంగా చెప్తున్నారు. అయితే ఆలయం ఆధ్వర్యంలో తయారుచేసే ఈ లడ్డుప్రసాదం భక్తుల అవసరాలకు అనుగుణంగా అంచనావేసి అందించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

# అత్యంత భక్తి శ్రద్దలతో కోటికుంకుమార్చన మహాయజ్ఞం









**బుచ్చి జులై 29 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో కోటి కుంకుమార్చన మహాయజ్ఞం అత్యంతభక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 19 నుండి ప్రారంభం అయిన కోటికుంకుమార్చన 29 వ తేదితో ముగిసింది. ఉదయం గోపూజ, వృషబార్చన, లక్ష్మీగణపతి పూజ, స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి నవావరణ పూజ, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు గోపుర మండపం ముందు బాగన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండం నందు శ్రీలలితా సహస్రనామ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు న్విహించారు. తదుపరి పెన్నానది లో అవభృధ స్నానం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కొలన్‌రాజారెడ్డి, పూజితమ్మ, తమ్మినేని మల్లికార్జుననాయుడు దంపతులు, వల్లూరు రవీంద్రరెడ్డి దంపతులు, పిడూరు శంకర్‌రెడ్డి దంపతులు వ్యవహారించారు. అనంతరం ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు రెండు సార్లు కోటికుంకుమార్చన కార్య క్రమం తన పదవికాలంలో చేయడం తాను పూర్వజన్మలో చేసికున్న పుణ్యం అని చెప్పారు. దాతల సహకారం అద్భుతమని అన్నారు. ఈకోటికుంకుమార్చనకు 4 టన్నులు కుంకుమ వినియోగించినట్లు తెలిపారు. 108 మంది రుత్వికులు నిత్యం పదిలక్షల ఆవర్తనాలతో పదిరోజులు కోటి ఆవర్తనాలు చేయడం జరిగిందని చెప్పారు. కంచికామకోటి పీఠాదిపతులు విజయేంద్ర సరస్వతీస్వామి ఆశీస్సులతో ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించారని ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## రొట్టెల పండుగ సందర్భంగా రెడ్‌క్రాస్ సేవలు



**నెల్లూరు టౌన్, జూలై29, ప్రభాతవార్త** : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ శ్రీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బారా షాహిద్ దర్గా నెల్లూరు నందు నిర్వహిస్తున్న రొట్టెల పండుగ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్సా శిబిరం, అంబులెన్స్ సర్వీసెస్, యూత్ రెడ్‌క్రాస్, విపత్తుల నివారణ కార్యక్రమాలను 100మందిరెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవలకు సహకారంతో ప్రారంభించారు. వివిధ ఘాట్‌లలో రొట్టెల పండుగ జరుపుకోవడానికి వచ్చినటువంటి వృద్ధులకు, వికలాంగులకు రెడ్‌క్రాస్ సేవకులు తోడుంటూ వారికి సహాయ సహకారాలను అందిస్తున్నారు ఈ కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చేస్తున్నటువంటి వివిధ రకాల సేవల గురించి తెలియజేశారు. రొట్టెల పండుగ జరుగుతున్న ఈ ఐదు రోజులు కూడా రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్సా శిబిరం, అంబులెన్స్ సర్వీసెస్, యూత్ రెడ్‌క్రాస్, విపత్తుల నివారణ సంస్థ ద్వారా రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవకులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం బారా షాహిద్ దర్గా దగ్గర స్వల్పంగా గాయపడిన 227మంది భక్తులకు రెడ్‌క్రాస్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స శిబిరం ద్వారా చికిత్స అందిస్తూ తీవ్రంగా గాయపడిన ఇద్దరు భక్తులను అత్యవసర చికిత్సల కొరకు జీజీహెచ్ హాస్పిటల్‌కు రెడ్‌క్రాస్ అంబులెన్స్‌లో తరలించారు. రొట్టెల పండుగ వేడుకలో అనంతపురం జిల్లా హిందుపూర్ వాస్తవ్యులు జబిన, హనీయలకు చెందిన నీలుఫర్ అనే చిన్నారి ఘాట్ వద్ద తప్పిపోయి ఏడుస్తూ గమనించిన నెల్లూరు రెడ్‌క్రాస్ యూనిట్ విచారించి ఆ చిన్నారిని వారి కుటుంబ సభ్యులకు మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది అప్పగించారు. రెడ్‌క్రాస్ వారు చేసినటువంటి ఈ సేవను అక్కడ ఉన్న భక్తులు ఎంతో ప్రశంసించారు. అలానే ఘాట్‌లో తప్పిపోయిన సుమారు 8 మంది చిన్నారులను రెడ్‌క్రాస్ సేవకులు గుర్తించి కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులకు అప్పగించారు. ఈ రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వికాస్ మర్మత్ సూచనల మేరకు వారి క్యాంపస్ నందు మెగా రక్తదాన శిబిరం ఐదు రోజుల పాటు కొనసాగేలా రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి రోజు 500 బ్లడ్ యూనిట్స్ లక్ష్యంగా ఐదు రోజుల పాటు కార్యక్రమం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దాసరిరాజేంద్రప్రసాద్, ఎంసీమెంబరు డాక్టర్ టి.రంజని, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఏవీ రమణయ్య, ఏఆర్‌వీ క్లినిక్ వైద్యులు, కోకన్వీనర్ ఎస్.వేణుగోపాల్, పీఎంపీ ప్రెసిడెంట్ కే.రవీంద్రబాబు, ఆర్ఎంపీ ప్రెసిడెంట్, గ్రామీణ వైద్యులు, స్టేట్ కోఆర్డినేటర్ జీవీ రవికుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్, నవీన్ కుమార్, నవీద్ అక్తర్, వాలంటీర్లు, మెర్సీ, హరీష్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అపరిచితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



**బిట్రగుంట, జూలై 29 ప్రభాతవార్త:** బోగోలు పంచాయతీలోని మణికంఠనగర్‌లో శనివారం సాయంత్రం ఓ దుకాణం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ మూడు సంవత్సరాల బాలికను ఎత్తుకొని వెళ్తుండగా పొంతనలేని సమాధానం చెప్పడంతో దుకాణ యజమాని కేకలు పెట్టాడు. దీంతో గ్రామస్తులు పరుగున వచ్చి అపరిచితుడు నుండి బాలికను విడిపించి దేహశుద్ధి పోలీసులకు అప్పగించారు. ఈ విషయం బేతనీయపేటలో చర్చనీయాంశమైంది. పిల్లలను ఎత్తుకొనిపోయే వారు వచ్చారన్న వార్త దావాలనంలా వ్యాపించడంతో పలువురు అప్రమత్తమయ్యారు. పోలీసులను వివరణ కోరగా అదుపులోకి తీసుకున్న వ్యక్తి గురించి ఆరా తీస్తున్నామని ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**వెంకటాచలం జూలై 29 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పని చేయాలని మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ సూచించారు.గ్రామాల్లో కొత్త ఓట్ల చేరిక,బోగస్ ఓట్లు ఏమైనా ఉంటే వాటిపై దృష్టి సారించాలన్నారు.మండలంలో క్లస్టర్,యూనిట్, ఇన్చార్జిలకు బూత్ కన్వీనర్లకు సోమిరెడ్డి కార్యలయ శిబ్బందితో కలిసి సమావేశము నిర్వహించారు.గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా విచారించాల్సిన బాధ్యత బిఎల్ఓలదే అన్నారు.కార్యకర్తలుగ్రామాలు వారిగా ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రానున్న ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపుకు కృషి చేయాలన్నారు.ఈకార్యక్రములో క్లస్టర్ ఇన్‌చార్జీలు యూనిట్‌లు,వల్లూరు రమేష్,ఉప్పలపాటి ధనుంజయ్య,కొండప్పనాయుడు, షేక్ సత్తార్,రాజేష్,సండి రమణయ్య కూరపాటి మస్తానయ్య,కడివేటి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూడిపర్తిలో జగన్న ఇళ్ల స్ధలాల్లో బురదమయం

**వెంకటాచలం జూలై 29 ప్రభాతవార్త:** పూడిపర్తి గ్రామంలో పేదలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల స్ధలాల్లో దారుణంగా బురదమయంగా ఉన్నాయని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు.పూడిపర్తిలో ఉన్న ఇళ్ల స్ధలాలను సురేష్‌నాయుడు శనివారం పరిశీలించారు.చిన్నపాటి వర్షానికి నీటి గుంటలగా ఇళ్ల ఉన్నాయని పేదలు ఇళ్లు కట్టుకుంటే ఏ విదంగా నివాసాల ఉండాలన్ని ప్రశ్నంచారు.అదికారులు ఇప్పటికైనా పూడిపర్తి పేదల ఇళ్ల స్ధలాల్లో మట్టి లైవలింగ్ చేసి గృహలు నిర్మించాలన్నారు.ఈకార్యక్రములో జనసేన నాయకులు పిట్టి మల్లికార్జున్,ఖాజ,శ్రీహరి,రహిం అక్బర్‌బాషా, చిన్న తదితరులు పాల్గోన్నారు.

## ప్రతిభచూపిన విద్యార్ధికి నగదు పంపిణీ



**వింజమూరు, జూలై29ప్రభాతవార్త:** వింజమూరు రవి ఉన్నతపాఠశాల విద్యార్థులు 2023 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరిక్షా ఫలితాల్లో రాష్ట్ర ప్రతిభ కనపరచిన విద్యార్థులకు కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ విద్యార్థుల ఉన్నత చదువుకు నగదు అందజేశారు. మోక్షజ్ఞకు 5వేల రూపాయలు, 15మందికి ఒక్కొక్కరికి వెయ్యిరూపాయల వంతున 15వేల రూపాయలను కాకర్ల సురేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్ధులు కూడా ఎంతో పట్టుదలతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్, గూండా శ్రీనివాసులు , ట్రస్ట సిఇఒ కాకర్ల వెంకట్ పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితునికి ఆర్ధికసాయం



**వింజమూరు, జూలై 29ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని బిసికాలనీవాసి కొక్కంటి సుబ్రహ్మణ్యం గత కొంతకాలంగా పక్షవాతంతో మంచానికే పరిమితమై ఉన్నాడు. సుబ్రహ్మణ్యం ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, టిడిపి నాయకులు కాకర్ల సురేష్ సుబ్రహ్మణ్యం నివాసానికి వెళ్ళి ఆయన్ను పరామర్శించి 10వేల రూపాయలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్రహ్మణ్యంను తమ ట్రస్ట్ తరపున మెరుగైన వైద్య చేయించుకునేందుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాకర్ల వెంకట్ , కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాదిగల అంతిమ పోరాటానికి సిద్ధం



**వింజమూరు, జూలై29ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే నినాదంతో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభతో మాదిగల అంతిమ పోరాటానికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాజరాగు మాదిగ డిమాండ్ చేశారు . శనివారం వింజమూరులోని ప్రవేటుకళ్యాణమండలంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకుడు గోచిపాతల వెంకటేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రతిపక్షపార్టీగా ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ళు గడుస్తున్నా వర్గీకరణ అంశాన్ని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం ప్రవేశపెట్టి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్ళేందుక కృషి చేయాలన్నారు. మాదిగలను వర్గీకరణ విషయంలో మోసం చేసిన పార్టీలతో రాజకీయంగా తాడోపేడో తేల్చుకునేందుకు 20లక్షల మందితో విశ్వరూప మహాసభ జరుగుతుందన్నారు. ఈమహాసభకు ఉదయగిరి నియోజకవర్గం నుండి మాదిగలు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు . జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో 8శాతం పైగా ఉన్న మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటుబ్యాంక్‌గా మాత్రమే పరిగణిస్తున్నారన్నారు. ఇకపై వర్గీకరణకు సహకరించిన పార్టీల జెండాలను మాదిగలు మోయరాదని , 2024ఎన్నికల్లో ఆపార్టీలకు బుద్ధిచెప్పాలన్నారు. వర్గీకరణ సాధించేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఇన్‌చార్జ్ సూరిపాక వాసుదేవరావ్, జిల్లా కోకన్వీనర్ కోలగట్ల రమేష్, సీనియర్ నాయకులు పకీర్‌జాషువా, ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ అడుసుమల్లి వేణుమాదిగ, సీనియర్ నాయకులు వడ్లపల్లి కృష్ణయ్య, బెజవాడ బాలగురవయ్య, యద్దనపూడి రమణయ్య, మాదిగ ఎంప్లాయీస్ నాయకులు ఆర్.చినరాములు, జి.కొండలరావ్, కలిగిరి మండల ఇన్‌చార్జ్ నందిపోగు వెంగళరావ్, గంగపట్ల మురళి, ఎంఎంఎస్ కోకన్వీనర్ మందా సుజాత, విహెచ్‌పిఎస్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ కేర్ టేకర్‌గా గుడి హరికుమార్‌రెడ్డి



**ఇందుకూరుపేట, జూలై29, ప్రభాతవార్త** : జనసేన పార్టీ కోవూరు నియోజకవర్గ సంరక్షకుడిగా మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన గుడి హరికుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడి హరికుమార్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా గుడి హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ మండలంతో పాటు సమానంగా మిగతా నాలుగు మండలాల్లో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై గళం విప్పుతామని తెలిపారు. జనసైనికులు ఏకధాటిగా నడుస్తూ కోవూరు నియోజకవర్గ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు గుండా మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, షంషాట్ తదితరులు పాల్గొన్నారు.

## యధేచ్ఛగా మట్టి మాఫియా, నిద్రావస్థలో అధికారులు



**ఇందుకూరుపేట, జూలై29, ప్రభాతవార్త** : అక్రమంగా మట్టిని, ఇసుకను రవాణా చేస్తున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్రచౌదరి ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండలంలో గంగపట్నం గ్రామంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా చెలరేగిపోవడంతో అందుకు సంబంధించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో వార్తలు వచ్చినా అధికారులు నిద్రమత్తులో ఉంటూ ఇసుక, మట్టి అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమార్కులు దర్జాగా ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తుంటే..మైనింగ్, రెవెన్యూ అధికారులు కళ్ల మూసుకొని ఉన్నరా అని ప్రశ్నించారు. గంగపట్నం నడిబొడ్డులో ఉన్నఒ అక్రమ లేఅవుట్‌కి పర్మిషన్స్ లేకుండా గిరిజనుల ఇళ్ల మధ్య నుంచి ట్రాక్టర్లతో అక్రమ రవాణా చేస్తున్నారని, అలాగే ఈ రవాణా వల్ల గిరిజనులు, పిల్లలు యాక్సిడెంట్లుకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని ఆరోపించారు. అలాగే ఈ అక్రమ రవాణాలో ట్రాక్టర్ డ్రైవర్లుగా మైనర్లను వాడుతున్నారని అన్నారు. పెన్నా పొర్ల కట్ల పరివాహక ప్రాంతాల నుంచి యదేచ్ఛగా ఇసుక మట్టి తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారని, అధికారులు తెలిసి తెలియనట్లు వ్యవహారిస్తున్నారు. పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు. ఇసుక మట్టి అక్రమ మాఫియాని మీడియా సోదరులు వెలికి తీస్తే, మీరు ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ రోజు కూడా ఇసుక అక్రమ మట్టి రవాణా జరుగుతూనే ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే టీడీపీ తరుపున పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి చెంచు కిషోర్‌బాబు, కొండూరు సుధాకర్‌రెడ్డి, మునగాల రంగారావు, కృష్ణారెడ్డి, కొండూరు వెంకట రమణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలిగిరిలో జగనన్నసురక్ష



**కలిగిరి, జూలై29, ప్రభాతవార్త;** జగన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకరంగా ప్రవేపెట్టిన జగనన్నసురక్ష కార్యక్రమం శనివారం మండల కేంద్రమైన కలిగిరిలో జరిగింది. కలిగిరిలోని 1వసచివాలయం, 2వ సచివాలయం పరిదిలో జరిగిన ఈకార్యక్రమంలో అధికారులు ప్రజలకు అవసరమైన 11రకాల సర్టిపికేట్లు అందజేశారు. ఈ సందర్బంగా ఈకార్యక్రమానికి ముక్యఅతిదిగా పాల్గొన్న కలిగిరిజడ్పీటీసి సబ్యులు పాలూరి మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ జగన్న పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు ఇంటివద్దకే పంపుతున్నారన్నారు. వీటికి కారకులైన గ్రామ వాలెంటీర్లు, సచివాలయ శిబ్బంది, అధికారులు ఎంతోకృషి చేస్తున్నారని కొని యాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాగిదివ్య, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



**ఆత్మకూరు, జూలై 29ప్రభాతవార్త:** షెడ్యూల్‌కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎ స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని రాఘవేంద్ర కళ్యాణమండలంలో ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ అధ్యక్షతన శనివారం జరిగిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర ంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గతంలో తాము అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి నేడు తొమ్మిదేళ్ళు అయినా వర్గీకరణ అంశాన్ని పరిష్కరించడంలో మాదిగలను నమ్మించి మోసం చేసిన పార్టీగా బిజెపి నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్ళేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు ఆగస్ట్ 3వ వారంలో 20లక్షల మంది ప్రజలతో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కర్నూలు నుండి ప్రారంభమైన ఛలో హైదరాబాద్ సన్నాహక సమావేశాలు 95నియోజకవర్గాల్లో గుంటూరు వరకు పర్యటన ఉంటుందన్నారు. వర్గీకరణ లక్ష్యం మహాజన సోషలిస్ట్ పార్టీ చట్ట సభల్లో అడుగుపెట్టే దిశగా ప్రనజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా తన పర్యటన ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి నెల్లూరుజిల్లా ఇన్‌చార్జ్ సూరిపాక వాసుదేవరావ్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా కోకన్వీనర్ అడుసుమిల్లి వేణు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తాటిపర్తి లక్ష్మయ్య మాదిగ, ఆత్మకూరు నియోజకవర్గంలోని మండలాల ఇన్‌చార్జ్‌లు బొద్దుకూరి మహేష్ మాదిగ, ఎంఎంఎస్ సీనియర్ నాయకులు గంగపట్ల లక్ష్మమ్మ మాదిగ , దుడ్డు రవి మాదిగ, గద్దం ఆదినారాయణ మాదిగ, ఎంఇఎఫ్ నాయకులు పెంచలయ్య, నల్లిపోగు అంకయ్య, కుంటా మల్లిఖార్జున, వి.రమణమ్మ, ఉదయగిరి బాబు, పుల్లయ్య, పి.వెంగళరావ్, చిన్నయ్య, ఎమ్మార్పీఎస్ , ఎంఎస్‌పి, ఎంఎస్‌ఎఫ్ మాదిగల విద్యార్థులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసారెడ్డిపాళెంలో కాకర్ల ట్రస్ట్ వైద్యశిబిరం



**కలిగిరి, జూలై29, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని నరసారెడ్డిపాళెంలో శనివారం కాకర్ల ట్రస్ట్ ఉచిత ఆరోగ్య సంజీవినీ వైద్యశిబిరం నిర్వహించారు. కాకర్ల ట్రస్ట్ అదినేత కాకర్ల సురేష్ ఆద్వర్యంలో జరుగుతున్న ఈవైద్యశిబిరంలో పలురకాల వైద్యసేవలు, సదుపాయాలు కలుగజేస్తున్నారు.నరసా రెడ్డిపాళెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి ప్రజలు తరలివచ్చి అనేకరకాల వ్యాదులకు సంభందించిన వైద్య పరీఓలు, సుగర్, బిపి తదితర పరీక్షలు చేయించుకున్నారు. ఈశిబిరంలో మొత్తం 160మంది పరీఓలు చేయించుకొని ఆయావ్యాదులకు సంభందిచి మందులను అందజేశారు.అదేవిదంగా కంటిచూపుకు సంభందిఒంచి 115మంది వైపరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు అందజేయడం జరిగిందని వైద్యశిబిరం నిర్వాహకులు తెలిపారు.ఈకార్యక్రమంలో డబ్బుగుంట బుజ్జియ్య,గంగపట్ల కొండయ్య,కోట మహేశ్వరరెడ్డి,దనియంకుల లక్ష్మీరాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి నాశిరంగా కొండ్లపూడి జగనన్న ఇళ్ల నిర్మాణం



**నెల్లూరు, జూలై29 ప్రభాతవార్త-విద్య:** నగరంలోని స్ధానిక కొండ్లపూడి జగనన్న లేఅవుట్‌లలో పేదలకోసం నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణం పూర్తిగా నాశిరంగా జరిగిందని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గనుకుల కిషోర్ ఆరోపించారు. శనివారం ఆపార్టీ నాయకులతో కలిసి కొండ్లపూడిలో జరుగతున్న ఇండ్ల నిర్మాణాలు పరిశీలించారు. స్ధానికులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతు ఈ లేవుట్‌లో 25శాతం కూడా ఇండ్ల నిర్మాణాలు పూర్తికాలదేన్నారు. గోడలు మాత్రమే పూర్తిచేసుకున్న నిర్మాణల్లో భారీ స్ధాయిలో అవితీని జరిగిందని, నాశిరకం మెటీరియల్ ను వినియోగించారని ఆరోపించారు. ఈ నిర్మాణాలకు వినియోగించిన యాష్‌బ్రిక్‌ను చేతితో పట్టుకుంటేనే పొడి పొడిగా మారిపోతున్నాయని, ఇటువంటి నాశిరకం ఇటుకలతో నిర్మించిన ఇండ్లు ఎంత గట్టిగా ఉండనున్నాయో తెలుస్తుందని దుయ్యబట్టారు, ఈ నిర్మాణాలల్లో అధికారుల నిర లక్ష్యం స్పష్టమౌతుందన్నారు. కనీస సౌకర్యాలులేకుండా, నిర్మాణాలు 90శాతం పూర్తిచేశామంటూ బాకాలు ఊదుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చి నాలుగేల్లు పూర్తి కావస్తున్నా ఇంతవరకు వీటిని పూర్తిచేయలేదని, ఇంకా ఎనేళ్ల సమయం పడుతుందలో తెలియదన్నారు. చాలీ చాలని ఆరు అంకణాల స్ధలంలో నిర్మాణాలకోసం 180000 ఇచ్చి కట్టుకోమనటం సరైన పద్దది కాదన్నారు. ఈనగదు ఎందుకూ పనికి రాదని దుయ్యబట్టారు. లైట్లు,రోడ్లు, మురుగు కాలువలు కంటి కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటుచేయలేదన్నారు. రెండేళ్లలోనే 5000 మందికి ఇండ్లు ఇస్ధామన్న అధికార పార్టీ నాయకలు మాటలు నీటిమీద రాతల్లా మారిపోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలుతీసుకుని త్వరిత గతిన నిర్మాణాలు పూర్తిచేయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దెపూడి సుధీర్, కొలా విజయ,రేణుక,ప్రవల్లిక, ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర,చిన్నరాజా, వర్షన్, ఖలీల్,మౌనిష్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించడం లేదు



**కావలి, జూలై 29 ప్రభాతవార్త:**తనను,తన కూతురిపై తమ్ముడు నయీమ్ దాడి చేసి గాయపర్చాడని పోలీసులను ఆశ్రయించినా స్పందించకుండా తనపైనే సిఐ శ్రీనివాసులు బెదిరింపులకు దిగారని బాధిత మహిళ జమీలా వాపోయారు. రక్షణ కోసం 100కు డయల్ చేసినా, ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మీడియాని ఆశ్రయించాల్సి వచ్చిందని, నాకు న్యాయం కల్పించాలని బాధిత మహిళ జమీలా వాపోయారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె రోదిస్తూ మాట్లాడారు. తన తమ్ముడు నయీమ్‌కు వైసిపి మైనార్టీ నేత అన్సర్ మద్దతుతో పోలీసులు తన ఫిర్యాదును పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు.పోలీసులు వైసిపి నేత అన్సర్ మాటే వింటున్నారని కావలి పట్టణం ఇస్లాంపేటకు చెందిన బాధిత మహిళ జమీలా తెలిపారు. తాను ఇస్లాంపేటలో వుంటున్నానని తన భర్త లేదన్నారు. ఇద్దరు తమ్ముళ్లు వున్నారన్నారు. మా అమ్మ పెద్ద తమ్ముడి ఇంటిలో వుంటుండగా చూడకుండా తరిమేశాడన్నారు. అప్పుడు మా అమ్మను మా ఇంటికి తీసుకెళ్లి ఐదు సంవత్సరాలుగా చూస్తున్నానన్నారు. అయితే గత నాలుగు రోజుల క్రితం చిన్న తమ్ముడు నయీమ్ ఊరు నుండి వచ్చాడన్నారు. తన భర్త చనిపోయి ఇబ్బందుల్లో వున్నానని అమ్మను తీసుకెళ్లి చూసుకోవాలని చెప్పినందుకు తనను కొట్టాడన్నారు. అడ్డం వచ్చిన తన కూతురిని కూడా కొట్టి వెళ్లిపోయాడన్నారు. ఈ విషయాన్ని 100కు ఫోన్ చేసి చెప్పానన్నారు. పోలీసులు రావడం వైసిపి మైనార్టీ నాయకుడు అన్సర్ మాట్లాడి పంపించేశాడన్నారు. ఆ తర్వాత ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశానన్నారు. స్టేషన్‌కు రెండు రోజులు తిరిగినా పోలీసులు కేసు కట్టలేదన్నారు. న్యాయం చేయమని పోలీసులను ప్రాధేయపడితే స్టేషన్‌కు మరలా వస్తే నీపైనే కేసు పెడతామని పోలీసులు బెదిరించారని ఆమె వాపోయారు. పోలీసులే న్యాయం చేయకపోతే ఇంకెవరు న్యాయం చేస్తారని ఆమె ప్రశ్నించారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ జమీలా వేడుకుంటుంది.

## ముసునూరులో జగనన్న ఇళ్ళ నిర్మాణాలు నాసిరకం

**కావలి, జూలై 29 ప్రభాతవార్త** :కావలి మున్సిపాల్టీ పరిధిలో ముసునూరులో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా వున్నాయని, అధికార పార్టీ నాయకులకే కాంట్రాక్ట్ పనులు అప్పజెప్పడంతో నాసిరకంగా, ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆరోపించారు. శనివారం ముసునూరులోని జగనన్న ఇళ్ళ నిర్మాణాల్ని జనసేన పార్టీ నేతలు పరిశీలించారు. ఇళ్ళ నిర్మాణాల సముదాయల వద్ద ప్లెకార్డులు పట్టుకొని నిరసన నినాదాలు చేశారు. అనంతరం జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నాదెండ్ల మనోహర్ సూచనలతో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలు పరిశీలించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ నేతలకు ఈ ఇళ్ళ నిర్మాణాల కాంట్రాక్ట్ పనులు అప్పచెప్పడంతో పనికిమాలిన మెటీరియల్ ఉపయోగించి నాసిరకంగా కడుతూ సొమ్ము చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. కావలి నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరుతో ఇష్టానుసారంగా గ్రావెల్‌ని అక్రమంగా తరలిస్తూ గ్రావెల్ మాఫియా వందలాది కోట్ల రూపాయలు అధికార పార్టీ నేతలు దోచుకున్నారన్నారు. భారీ వర్షాలు పడితే ఇక్కడ వున్న కొండమట్టి కరిగి ఇళ్లపై పడి కాలనీ ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ముసునూరు జగనన్న ఇళ్ళ నిర్మాణాలలో నాసిరకం నిర్మాణాలు చేస్తుంటే ఎలాంటి సంబంధం లేనట్లుగా రెవెన్యూ శాఖ అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ల అవినీతి, నాసిరకం నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని అళహరి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత రుషికేష్ మాట్లాడుతూ కావలిలో జరిగిన జగనన్న ఇళ్ళ స్థలాల కుంభకోణంలో ఆనాటి కలెక్టర్‌ను బదిలీపై వెళ్లేలా చేసిన ఘనత కావలి వైసిపి నాయకులదేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిఠల్, కోఆర్డినేటర్ సుధీర్, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలా శ్రీనాథ్, నాగార్జున, ప్రవీణ్, నయీమ్, ఆది, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే మహిళాభివృద్ధి



**విడవలూరు, జూలై29, ప్రభాతవార్త:** టీడీపీ ప్రభుత్వంలోనే మహిళాభివృద్ధి జరిగిందని కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి గ్రామంలో ఆయన మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలన్ని అబద్దాలేనని, మహిళలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేసింది తెలుగుదేశం పార్టీ అని అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్య పెడుతూ పక్కదారి మళ్లిస్తూ అధిక ధరలతో ప్రజల నుంచి దోపిడి చేస్తున్న ఈ ముఖ్యమంత్రికి ఓటుతో ప్రజలే బుద్ది చెప్పాలని చెప్పారు. అనంతరం రైతుల గురించి మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కూడా ఈనాడు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళలు రైతులు ఇలా అన్ని రంగాల ప్రజలను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం ఒక్క వైసీపీ అని ఆయన విమర్శలు చేశారు. టీడీపీ మేనిఫెస్టోలో ఉన్న ప్రతి ఒక్క పథకంతో ప్రజలు సంతృప్తి చెందుతారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కోవూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాగుంట స్నేహలత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు తారా స్థాయికి చేరాయని ఆరోపించారు. దిశ చట్టంతో మహిళలకు ఇప్పటికి దాదాపుగా అత్యాచార కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారని విమర్శించారు. సర్పంచ్ రామిశెట్టి స్వాతి, మాజీ సర్పంచ్ చెముకల కృష్ణచైతన్య, శ్రీనివాసులు, దూది విజయ రాఘవన్, కొరిమెర్ల శేషయ్య, మైనార్టీ నాయకులు ఇమామ్ భాష, చలంచర్ల కామేశ్వరమ్మ, సత్యంరెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో కాంద్ర సతీష్‌నాయుడు జన్మదిన వేడుకలు

**బిట్రగుంట, జులై 29 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆదరణ కేంద్రంలో శనివారం కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకులు కాంద్ర సతీష్‌నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆదరణ కేంద్రం నిర్వాహకులు కె.సింహాద్రిరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సింహాద్రిరావు మాట్లాడుతూ ఆదరణ కేంద్రానికి శాశ్విత దాతగా వుంటూ ఈ కేంద్రంలో కనీస అవసరాలు కల్పించడంతో పాటు ప్రతి నెల ఆదరణ కేంద్రానికి అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సేవాభావం కల్గిన కాంద్ర సతీష్‌నాయుడు మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## పున్నూరు గిరిజన కాలనీలో బాల సంస్కార కేంద్రం



**ఇందుకూరుపేట, జూలై29, ప్రభాతవార్త** మండలంలోని పున్నూరు గిరిజన కాలనీలో యానాదీస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో గిరిజన బాలబాలికలకు విద్యాబోధనలో భాగంగా చదవడం రాయడం రాని వయోజనులకు బాల సంస్కార కేంద్రం ద్వారా సాయం బడి నిర్వహిస్తున్నారు. ఈనిర్వహణలో గిరిజన నాయకులు పొట్లూరి శ్రీనివాసులు, సుబ్బారావు, జజం సుష్మకుమార్ తదితరులు బాధ్యతలు వహిస్తున్నారు.

## కోడూరు-2లో జగనన్న సురక్ష



**తోటపల్లిగూడూరు, జూలై29, ప్రభాతవార్త** మండలంలోని కోడూరు సచివాలయంలో జగనన్న సురక్ష డెస్క్ చివరి సమావేశం శనివారం ఎంపీడీఓ హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌డీఓ వసుమతి మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వే నిర్వహించడంలో తహశీల్దార్ హమీద్, ఎంపీడీఓ హేమలత, ఈవోఆర్డీ నారాయణరెడ్డి వీరితో పాటు నిబద్దతతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కృషి కారణంగా జగనన్న సురక్ష సర్వే మండలంలో విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కోడూరు సచివాలయం-2లో 82.61 శాతం సర్వే సాధించడం జరిగిందన్నారు. అనంతరం 1700ల మందికి ఆయా సర్వీసుల ద్వారా సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శేషమ్మ, వైస్ ఎంపీపీ కంజి నీలమ్మ, వైకాపా నేతలు కోడూరు దిలీప్‌రెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ ముక్తార్ భాష, కంజి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించిన ఎంపీకి మావులూరు కృతజ్ఞతలు



**ఇందుకూరుపేట, జూలై29, ప్రభాతవార్త** రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని శనివారం నెల్లూరులోని ఆయన నివాసంలో రాష్ట్ర వైసీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి, ఇందుకూరుపేట మండల పార్టీ కన్వీనర్ మావులూరి శ్రీనివాసులరెడ్డి ఎంపీ స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఎంపీ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా పరిష్కరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో లేబూరు మహీధర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి ఫణీంద్రనాయుడు, బీసీ సెల్ అధ్యక్షులు సంతోష్‌గౌడ్, ఎస్‌కే షబ్బీర్ నాయుడు, సురేష్, రవి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షలో 15082 సర్టిఫికేట్లు పంపిణీ



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో జూలై నెలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 15082 వివిధ రకాల సర్టిఫికేట్లను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ 16 సచివాలయాల పరిధికి సంబంధించిన 6503 కుల దృవీకరణ పత్రాలను, 6417 ఆదాయ ధృవీకరణ పత్రాలను లబ్దిదారులకు అందజేయడం జరిగింద న్నారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన 120 రైస్ కార్డులు కూడా ఈ సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు , ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు ప్రత్యేకంగా కృషి చేశారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## ముఖ్యమంత్రి సారూ.. మాట నిలబెట్టుకోండి



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు సాధించిన కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించి సహకార రంగంలో నడిపేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీ చెరుకు రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. కోవూరులోని సీతాపోలయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన ఎన్నికల సభలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ షుగర్ ఫ్యాక్టరీ తెలుగుదేశం పార్టీ పుణ్యమా అని మూతపడిందని, భగవంతుని దయ, మీ అందరి ఆశీస్సులతో తమ పార్టీ అధికారంలోకి రాగానే తెరిపించి నడుపుతానని ఆయన హామీ ఇచ్చి 4 సంవత్స రాలు అయినా ఇంతవరకు నిలబెట్టుకోలేదన్నారు. సహకార రంగంలో ఫ్యాక్టరీని తెరిపించి నడపకపోగా ఫ్యాక్టరీ ఆస్తులను చౌకగా రియల్ ఎస్టేట్ దారులకు అప్పగించే చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ షుగర్ ఫ్యాక్టరీ స్థలాన్ని నుడాకు అప్పుగా ఇచ్చి వారు ప్లాట్లుగా పెట్టి అమ్మగా వచ్చిన డబ్బుతో కార్మికులకు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఇటీవల సమాచారం వచ్చిందన్నారు. సహకార చట్టానికి విరుద్ధంగా ఫ్యాక్టరీ వాటాదారులైన రైతులతో ప్రత్యేక సమావేశం జరిపి ఆమోదం తీసుకోకుండా దొడ్డి దారిన పర్సన్ ఇన్‌చార్జిలతో, ఎండీలతో జనరల్ బాడీ నిర్వహించలేమని కుంటిసాకులు చెప్పి లిక్విడేటర్‌ను వేసి ఫ్యాక్టరీని అమ్మివేసే చర్యలు వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చెరుకు సంఘం నేతలు శ్రీనివాసులు, శ్రీరాములు, వెంకమరాజు మల్లారెడ్డి, , రఘురామయ్య, బాబు, జి. శేషయ్య, సుబ్బారావు, బుజ్జయ్య, నవీన్ తదితరులు పలు సూచనలు చేశారు.

## ఈ నెలాఖరులోగా పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు ఈ నెలాఖరులోగా పీఎం కిసాన్ ఈకేవైసీని నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఈ క్రాప్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ నమోదు చేసుకుంటేనే 15వ విడత పీఎం కిసాన్ రైతుల ఖాతాల్లో నమోదు కావడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు సబ్ డివిజన్ పరిధిలో 15082 గానూ 13321 మంది మాత్రమే పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు కూడా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సీసీఆర్‌సీ కార్డులకు సంబంధించి 6890 మందికి ఈ కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 3509 మంది కార్డులు పొందారని, మిగిలిన ఇద్దరు కూడా ఈ కార్డులు పొందాలన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ఈ క్రాప్ నమోదు 42 వేల ఎకరాలకు గానూ 8016 ఎకరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. రైతులు కూడా ఈ క్రాప్ నమోదు చేసుకుంటే వారికి అనేక ఉపయోగాలు ఉన్నారు.

## నియోజకవర్గ పర్యవేక్షకులుగా శ్రీనివాసులురెడ్డి, హరిరెడ్డి



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ జనసేన పార్టీకి సంబంధించి చప్పిడి శ్రీనివా సులురెడ్డి, గుడి హరిరెడ్డిలను నియోజకవర్గ పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని , వారి సహకారం సూచనలతో పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం . ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జనసేన పార్టీ తరఫున ఎటువంటి కార్యక్రమాలు చేయాలన్నా వీరిరువురితో సంప్రదించి పార్టీ కార్యక్రమాలు చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ మాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేలా దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం. మున్వర్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎం. పవన్ కుమార్, కోవూరు మండల అధ్యక్షుడు షేక్ అల్తాఫ్, బుచ్చి మండల అధ్యక్షుడు మాధవరావు, కోవూరు నియోజకవర్గ పర్యవేక్షకులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, గుడి హరిరెడ్డి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని జనసైనికులు ఉన్నారు.

## మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

**నెల్లూరుటౌన్, జూలై 29, ప్రభాతవార్త:** షెడ్యూలు కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీయస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ సిటీ నియోజకవర్గం జాకీర్ హుస్సేన్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి 9 ఏళ్ళు గడుస్తున్నప్పటికీ పరిష్కరించడంలో మాదిగలను నమ్మించి మోసం చేసిన పార్టీగా బీజేపీ నిలిచిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు తీర్మానం ప్రవేశపెట్టి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు ఆగస్టు మూడో వారంలో మాదిగల విశ్వరూప మహాసభను 20 లక్షల మంది ప్రజలతో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గంలోని మాదిగ ప్రజలు తరలిరావాలన్నారు. రాష్ట్రంలో 8 శాతంగా పైగా ఉన్న మాదిగ ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయన్నారు. కర్నూలు నుండి ప్రారంభమైన ఛలో హైదరాబాద్ సన్నాహక సమావేశాలు 95 నియోజకవర్గాల్లో గుంటూరు వరకు పర్యటన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ సూరిపాక వాసుదేవరావు మాదిగ, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ, కొత్తపల్లి మాతయ్యమాదిగ, పరుసు బాబులు మాదిగ, జలదంకి జాస్వాకుమారి మాదిగ, బిరదవోలు మస్తాన్ మాదిగ, అధిక సంఖ్యలో ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఒక వరం



**గోనుపల్లి(రాపూరు), జూలై29 ప్రభాతవార్త** జగనన్న సురక్ష పథకం ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ఒక వరం లాంటిదని పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ నెల్లూరు రవీంద్రా రెడ్డి తెలి పారు. శనివారం గోనుపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ గోతాటి నారాయ ణమ్మ ఆధ్యక్షతన నిర్వహించారు. సచివాలయం పరిది లో ని గో నుప ల్లి , రా పు కూ రు గ్రామాలలోని ప్రజలకు జగనన్న సురక్ష ద్వారా మంజూరైన 11 రకాలైన ధృవీకరణ పత్రాలనుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాలైన ధృవీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. మండల జెసిఎస్ కన్వీనర్‌దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నెల్లూరు శివకుమార్ రెడ్డి, వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి నారసింహా రెడ్డి, యంపీడీఓ అప్పాజీ, వివిధ శాఖల అధికారు, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## కోనలో వైభవంగా నృసింహుని నిత్య కళ్యాణం



**పెంచలకోన(రాపూరు), జూలై29 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయంస్వామి వారికి ప్రత్యేకంగా అభి షేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి అమ్మవార్లను ప్రత్యే కంగా అలంకరించి వేదపం డితులు, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా ఆలంకరించి తిరుచ్చిపై వుంచి బోయిలు మొసుకుంటూ వచ్చి స్వామి వారి సహస్ర దీపాలంకరణమండపంలో వుంచి వేదపండితులు స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారినిదర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి ఏర్పాట్లను ఆలయ సిబ్బంది, ఇతర అధికారులు వర్యవేక్షించారు.

## ముగిసిన మొహరం వేడుకలు

**మర్రిపాడు, జులై29ప్రభాతవార్త:** మండలంలోని చుంచులూరులో శనివా రంతో మొహరం వేడుకలు ఘనంగా ముగిశాయి. తెల్లవారుజామున అగ్ని గుండ మహోత్సవాన్ని ఎంతో వైభంగా నిర్వహించారు. అనంతరం పీర్ల ఊరే గింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, బంధుమిత్రులు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం సోదరులందరూ కలసి మతసామరస్యానికి ప్రతీకగా ఈ పండుగను నిర్వహించారు.

## వెంకన్నపాలెంలో జగనన్న సురక్ష



CHANGE OF NAME
SURA SREENIVASULU (Old Name) Resident of Panchedu Village, Buchireddypalem Mandal, SPSR Nellore Dist. - 524 306 (A.P.) Hear by declare that I have changed my Name as SURA SRINIVASULU REDDY (New Name) S/o. Kodanda Ramireddy. Cell : 9440402989

**మనుబోలు, జులై29, ప్రభాతవార్త:** మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో శనివారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగ పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాలలోని వివిధ వర్గాల వారకి కుల, నివాస, ఆదాయం సర్టిఫికేట్లను 814మందికి అందజేశారు. వెంకన్నపాళెం వై.సి.పినేత వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంలో జట్.పి.టి.సి చిట్టమూరు అనితమ్మ, ఎం.పి.పి గుండాల వజ్రమ్మ, మనుబోలు ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖరరెడ్డి, వెంకన్నపాళెం సర్పంచ్ తలారి పెంచలమ్మ, నెట్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ మాట్లాడారు. వీరితోపాటు వై.సి.పినేతలు మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాలరెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, తహసిల్దార్ శివకృష్ణయ్య చేతులమీదుగ జగనన్న సురక్ష సర్టిఫికేట్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఎం.పి.డి.ఒ జి వెంకటేశ్వర్లు, ఎం.పి.టి.సి బుర్రి మమత, వై.సి.పి సీనియర్ నాయకులు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, అడపాల శివకుమార్‌రెడ్డి, చిట్టమూరు నరేందర్‌రెడ్డి, ఉగ్గుమూడి గోపిరెడ్డి, నువ్వూరు పద్మనాభరెడ్డి, ఇ.ఒ.పి.ఆర్.డి ప్రసాద్, పంచాయతి కార్యదర్శి మల్లి చెంచుప్రసాద్, డిజిటల్‌అసిస్టెంట్ శరణ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ వినయ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యాసర్, పంచాయతి కార్యదర్శి జి నరేష్, సర్వేయర్ కె అజయ్‌కుమార్, వాలంటీర్లు కె అజయ్‌కుమార్, వల్లం శ్రీనివాసులు, శ్రీపతి వెంకటేశ్వర్లు, జెర్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం



**జలదంకి, జులై29, ప్రభాతవార్త:** మొహర్రం పండుగను ముస్లిం సోదరులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్తానిక పీర్లచావడిలో ప్రతిష్టించిన పీర్లకు మూడురోజులు విశేషూజలు నిర్వహించిన అనంతరం మరోమారు ప్రత్యేకప్రార్ధనలుచేశారు. అగ్నిగుండంను మూసివేసి పీర్లను ఎత్తారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలు, డి.జె సౌండ్స్, కోలాటాల డాన్సులు మధ్య పెద్దఎత్తున తరలివచ్చిన భక్తుల నడుమ గ్రామ వీధులలో ఊరేగింపు కోలాహలంగ సాగిందిరాత్రివేళ స్తానిక తూర్పుదొరువు నీటిలో నిమజ్జనం చేశారు. ఇరాన్‌లోని కర్బలా మైదానంలో జరిగిన యుద్దంలో అమరులైన వారిని స్మరిస్తూ వారి త్యాగానికి నిదర్శనంగ ఈ పండుగను నిర్వహిస్తారు. హిందూ, ముస్లిం సోదరులతోపాటు కుల, మతాలకతీతం అందరు ఈవేడుకల్లో పాల్గొన్నారు. ముత్తవల్లి వారసులైన షేక్ అల్లాభాషా, షేక్ నాయబ్‌రసూల్, షేక్ నాయబ్‌రసూల్ ఆద్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో రసూల్, ఖాజారహంతుల్లా, బాషాబాబు, గులాంభాషా, ఫయాజ్ తదితరులు పాల్గొని కార్యక్రమ సక్రమ నిర్వహణకు తమవంతు సహకారం అందించారు. కాగా ఈసందర్భంగ ఎస్.కె బాబ్జి, రజియాబేగం దంపతుల ఆద్వర్యంలో ఈన్నదాన కార్యక్రమం నిర్వహించి అందరి ప్రశంశలందుకున్నారు.

## సంక్షేమ వసతిగృహాలలోని సమస్యలను పరిష్కారానికి కృషిచేయండి



**నెల్లూరుటౌన్, జులై29, ప్రభాతవార్త:** సంక్షేమ వసతిగృహాలలోను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాల్సిందిగ జిల్లా హాస్టల్, వెల్ఫేర్, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.ఎల్.సి మేరుగ మురళీధర్‌ను కలసి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తిచేశారు. శనివారం సాయంత్రం నెల్లూరు నగరంలోని ఎల్.ఐ.సి అతిదిగృహంలో అసోసియేషన్ నాయకులు ఈదూరు విజయ్‌కుమార్, డాక్టర్ ఆవుల నరసింహం, అశోక్‌కుమార్, మస్తానయ్య, నరసింహులు, అరుణమ్మ, రిజ్వానా, సుమలత, మరికొంతమంది కార్యవర్గ సభ్యులు కలసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది జూన్ నెలనుంచి అమలు చేస్తున్న జి.ఒ ఎం.ఎస్ నంబర్ 8 ప్రకారం కళాశాల వసతి గృహ విద్యార్ధికి నెలకు 16వందల రూపాయలు పదవతరగతిలోపు వసతిగృహ విద్యార్ధికి 14 వందల రూపాయలు పెంచడం జరిగిందన్నారు. దీనిప్రకారం మెను అమలు చేయాల్సివుంది. మెను, క్వాంటిటి జి.ఒలో ఇచ్చారేకాని రోజువారి క్వాంటిటి కూడా ఇవ్వడం జరిగిందని అయితే నిత్యావసర సరకుల ధరలు పొందుపరచలేదని దీంతో ప్రస్తుతం వున్న ధరల ప్రకారం జి.ఒ నంబర్ 8 ప్రకారం మెనుతోపాటు క్వాంటిటి ఇవ్వలేని పరిస్తితులు ఉన్నాయని వారు ఎం.ఎల్.సి దృష్టికి తీసుకెళ్ళారు. ప్రభుత్వం పునరాలోచించి ప్రస్తుతం వున్న నిత్యావసర ధరల కను గుణంగ కళాశాల, సాదారణ వసతి గృహాల విద్యార్దుల నెలవారి మెను చార్జీలను మరింతగా పెంచాలని వారు విజ్ఞప్తిచేశారు. లేని పక్షంలో ప్రస్తుత ధరలకు నిమిత్తంలేకుండ ప్రభుత్వమే నిత్యావసర సరకులను నేరుగ సంక్షేమ వసతి గృహాలకు సరఫర చేసినట్లయితే ప్రభుత్వం నిర్దేశించిన మెను విద్యార్దులకు అందజేయగలమని ఆ వినతి పత్రంలోకోరారు. విద్యార్దులకుమెను, క్వాంటిటి తాము అందజేయడంలో ఎదుర్కొంటున్నప్రధాన సమస్య ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాల్సిందిగ సంక్షేమ వసతి గృహాల నాయకులు విజ్ఞప్తిచేశారు.

## జగనన్న కాలనీల నిర్మాణాలు నాశిరకం



**బుచ్చి జులై 29 ప్రభాతవార్త** నియోజకవర్గంలో జగనన్న కాల నీలు అవినీతి మయమైయ్యా యని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని విలియమ్స్‌పేట జగనన్న కాలనీని జనసేన నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో వారు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఇండ్ల నిర్మాణాలలో నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా పురోగతి లేదని ఆయన మండిపడ్డారు. జగనన్న కాలనీలలో మౌళిక వసతులు శూన్యం అని చెప్పారు. కాలనీలలో నీటి వసతి లేకుండా, రోడ్ల నిర్మాణం లేకుండా లబ్దిదారులు ఎలా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈనిర్మాణాలు భవిష్యత్తులలో లబ్దిదారులకు ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయని హెచ్చరించారు. బూడిద మిశ్రమంతో తయారు చేసిన సిమెంట్‌రాళ్ళు తో కట్టి అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆర్భాటాలు తప్ప జగనన్న కాలనీలు అంతా నాశిరకంగా జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిబందనలు ప్రకారం నిర్మాణాలు జరగడం లేదని దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యాక్షులు సుధీర్, కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, ఖలీల్, హేమచంద్రయాదవ్, వర్షన్ ప్రసాద్, సురేష్, పసుపులేటి వెంకటరమణ, సాయి, షారు బుచ్చి మండల ఉపాధ్యాక్షులు తుమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు స్కూటర్లుఢీ-వ్యక్తి మృతి



**ఆత్మకూరు, జులై29ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం నారంపేట క్రాస్‌రోడ్డ సమీపంలో శనివారం నెల్లూరు - ముంబాయి జాతీయ రహదారిపై రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ఈసంఘటనలో ఎదురుగా వస్తున్న లారీకింద ఒక వ్యక్తి పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలైనాయి . వీరిని ఆత్మకూరు హాస్పెటల్‌కు తరలించారు. మృతుడు కనిగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

# రక్తదాన శిబిరం ప్రారంభించిన కమిషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్, జూలై29, ప్రభాతవార్త** బారా షహీద్ దర్గా రొట్టెల పండుగను పురస్కరించుకుని నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని కమీషనర్ వికాస్ మర్మత్ శనివారం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 40 పడకల రక్తదాన శిబిరంలో దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ఆదర్శనీయమని ప్రశంసించారు. రొట్టెల పండుగ జరిగే ఐదు రోజుల పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. అవకాశమున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చుకుని ప్రాణదాతలు కావాలని కమీషనర్ ఆకాంక్షించారు. అదే విధంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గాప్రధాన మార్గాల సమీపంలో వయోవృద్దులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక ప్రయాణికుల వాహనాలను ఏర్పాటు చేసి అందరికి దర్గా దర్శనం కలిగేలా సేవలు అందిస్తున్నామని కమీషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలు మొబీన, వైద్యులు సింధూజ, శ్రావ్య, దిలీప్, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ జయసింహ, మధుసూదన్‌రావు, భాస్కర్‌రావు, కార్పొరేషన్ మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కొండబిట్రగుంటలో ఊంజల్ సేవ

**బిట్రగుంట, జూలై 29 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీ స్వామి వారికి, అమ్మవార్లకు ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. వరుస సెలవుదినాలు రావడంతో దేవస్థానంలో భక్తుల రద్దీ కనపడింది. సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఆలయ ఇవో ఎ.రాధాకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



# దేశంలో మతోన్మాదపాలన కొనసాగుతోంది




**కందుకూరు, జూలై29, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గంలోని సీపీఎం పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు శనివారం కందుకూరు సుందరయ్య భవన్‌లో జరిగాయి. సీపీఎం సీనియర్ నాయకులు జి.వెంకటేశ్వర్లు క్లాసులకు ప్రిన్స్‌పాల్‌గా వ్యవహరించారు. వర్తమాన జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు సీపీఎం వైఖరి అనే అంశంపై సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు వై.సిద్దయ్య బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం కార్పొరేట్ల కనుసన్నలలో మతోన్మాద పాలనసాగుతుంద`న్నా రు. దేశంలో ఉన్న సంపదలో3వ వంతు సంపద 194మంది కార్పొరేట్ల దగ్గర ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనేక రాయితీలు ప్రోత్సాహకాలు కల్పించి, దేశ సంపద మొత్తాన్ని దారాదత్తం చేసిందని ఆయన అన్నారు. ఒకే భాష, ఒకే సిద్ధాతం, ఒకే జాతి, ఒకేమతం, అనే ధోరణితో పరిపాలన చేస్తూ, ఈ దేశం నుండి వెళ్లి పొండి లేకుంటే, హిందూ మతానికి లోబడి ఉండాలని దుర్మార్గ పరిపాలన సాగిస్తుందన్నారు. హిందువులలో కూడా పెద్ద పెట్టుబడిదారులకు మాత్రమే దోచిపెడుతూ మిగతా హిందువులనుపావులుగా వాడుకుంటు న్నారు. 40రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, 4లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి, కార్మికుల హక్కులను హరించి వేస్తుంది. ఈ శిక్షణా తరగతుల్లో సీపీఎం నాయకులు, ముప్పరాజు కోటయ్య, ఎస్‌కె గౌస్, జీవీబీ కుమార్, ఎస్‌కె మున్వర్ సుల్తానా, మండలాల నాయకులు కొట్టే వెంకయ్య, కొమరగిరి వెంకటేశ్వర్లు, పొన్నం రామలక్ష్మ మ్మ, గుత్తి స్టాలిన్, దువ్వూరి జాన్, రామూర్తి, మల్లిక`, వెంకటేశ్వర్లు, శేషమ్మ, విజయ, అస్మా, ఎస్.డి గౌస్‌భాషా, మాదాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రానున్నది జనసేన పార్టీ పాలనే




**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** దేశంలోనే ఏ పార్టీ చేయని విధంగా పార్టీ కార్యకర్తలకు ప్రమాద భీమా కల్పించిన ఏకైక పార్టీ జనసేన అని ఆ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ మనుక్రాంత్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన జన సైనికులకు గుర్తింపు కార్డులు, పార్టీ సభ్యత్వానికి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సభనయత్వం తీసుకున్న వారు ఏమైనా అనుకోని పరిస్థితిలో ప్రమాదాల బారిన పడితే తక్షణమే వారి మందుల ఖర్చుల నిమిత్తం 50 వేల రూపాయలను ఒక వేళ అనుకోని పరిస్థితిలో మృతిచెందితే 5 లక్షల రూపాయలను ఆ కుటుంబానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ విధంగా జనసైనికులకు భారతదేశంలో ఏ పార్టీ చేయని విధంగా ఇటువంటి మంచి కార్యక్రమాన్ని రూపొందించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు, నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొన్న జనసైనికులకు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఇటువంటి మంచి భావాలు కలిగిన జనసేన పార్టీకి రాష్ట్ర ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతుందని, ఎటుచూసినా అక్రమాలు, దోపిడీలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. కోవూరు ఎమ్మెల్యే తమ పార్టీపైనా, అధినేతపైనా వ్యక్తిగత దూషణలే తప్ప ఈ నాలుగేళ్లలో ఆయన చేసిందేమీ లేదన్నారు. ఆయనకు మేము అడిగిన చెప్పకుండా మా పార్టీ అధినేతపై విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. నియోజకవర్గంలో రోడ్లు దారుణంగా ఉన్నాయని, ఎటు చూసినా ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాతో పార్టీ నాయకులు దోచుకుంటూన్నరన్నారు. ఇప్పటికైనా ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం జనసైనికులకు గుర్తింపు కార్డులు, పార్టీ ప్రచార సామగ్రిని పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం. మున్వర్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎం. పవన్ కుమార్, కోవూరు మండల అధ్యక్షుడు షేక్ అల్తాఫ్, బుచ్చి మండల అధ్యక్షుడు మాధవరావు, కోవూరు నియోజకవర్గ పర్యవేక్షకులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, గుడి హరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

**నెల్లూరు జూలై 29, ప్రభాతవార్త-వైద్యం** అందరం కలిసికట్టుగా ఉంటూ తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు యూనిట్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో నాకోసం పనిచేసిన ఏ ఒక్కరిని వదులుకోనన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, దొడ్డపనేని రాజానాయుడు, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, కుదుముల చిరంజీవి, నెల్లూరు మురళినాయుడు, కె వెంకటసాయిబాబా, కనపర్తి గంగాధర్, ఎం రఘు, ఊరందూరు సురేంద్ర బాబు, ఎం పెంచలనాయుడు, అల్లాబక్షు, సారంగం గున్నయ్య జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పధకాలను మహిళల్లోకి తీసుకువెళ్తాం



**నెల్లూరు జూలై 29, ప్రభాతవార్త-వైద్యం** కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ మహిళల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పధకాలను బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆ సంక్షేమ పధకాలను మహిళలకు తెలియపరుస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యమున పథక్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న భారతీయ జనతా పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో యమునపథక్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నాయని, వాటిని చూస్తే వైసీపీ పరిపాలన ఎంతటి దౌర్భాగ్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. నగర, రూరల్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు సందర్శించామన్నారు. విద్యార్థులు ఉంటున్న వసతిగృహాల్లో కనీస మౌళిక వసతులు లేకపోవడం దారుణమన్నారు. ఆ భవంతులు శిధిలావస్థకి చేరుకున్నా అందులోనే పేద విద్యార్థులు తలదాచుకుంటూ చదువుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే మనస్సును కలచివేశాల ఉన్నాయని పథక్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ స్థానిక అధికారులు సైతం ఏమి చెయ్యలేని పరిస్థితని, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని వీడి వసతి గృహాలకు నూతన భవంతులను ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమావేశం తాను ముఖాముఖిలో మాట్లాడానని ఎవరితో మాట్లాడినా కన్నీటి గాధలేనన్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు 50 మంది సభ్యులను అప్పచెపితే, అదే ఆశా వర్కర్లకు 5వేలమందిని అప్పచెప్పి తమ చేత ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని వారి బాధను వెళ్ళపోస్తున్నారని తెలిపారు. స్థానిక అధికార యంత్రాంగం వారిపట్ల చూపిస్తున్న వివక్షత, నిరంకుశ ధోరణిని అవలంభిస్తోందని ఆమె మండిపడ్డారు. గర్భిణీలకు మెటర్నిటీ సెలవులు ఇవ్వకపోవడం హేయమైన చర్యని పథక్ ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆశా వర్కర్ల ధర్నాలు చేస్తూ ప్రభుత్వానికి ఎన్ని వినతులు అందించినా చలనం లేకుండా సరికాదన్నారు. ఇలాంటి అన్ని అంశాలపై బీజేపీ మహిళా మోర్చా అభాగ్యులకు అండగా ఉంటూ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు కేంద్రం నుంచి వస్తున్న సంక్షేమ పధకాలు అందుకుంటున్న మహిళా లబ్దిదారులను కలిశామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పధకాలు అందకపోయినా కేంద్రం నుంచి అయినా కాస్తో కూస్తో పధకాలు అందుతున్నాయని లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తంచేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేలాదిగా మహిళా కేసులు నమోదైయ్యాయన్నారు. ఎన్‌సిఆర్‌బి రిపోర్టుల ప్రకారం ఏఫ్ఐఆర్ నమోదు అయిన కేసులు కాకుండా, ఎన్నో మిస్సింగు కేసులు ఉన్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ప్రభుత్వం ఆమె ఆరోపణలు చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త బ్రాండ్ల పేరుతో విడుదల చేసిన మద్యం తాగి ఎంతోమంది మహిళలు వితంతువులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై బీజేపీ మహిళా మోర్చా సమగ్రమైన పోరాటాలు చేపడుతోందన్నారు. మహిళల విషయంలో ప్రభుత్వం తన ధోరణిని మార్చుకోకపోతే మహిళా మోర్చా ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెపుతామని ఆమె హెచ్చరించారు.

# నారాయణలో ఆగస్టు 1 నుంచి తక్కువ ఖర్చుకే కాలేయ పరీక్షలు




**నెల్లూరు జూలై 29, ప్రభాతవార్త-వైద్యం** లివర్ సమస్యల బారినపడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు కనీసం ఏడాది ఒక్కసారైనా కాలేయ పరీక్షలు చేయించుకుంటే మంచిదని నారాయణ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాల జిస్ట్ ఎంజి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నారాయణ ఆసుపత్రిలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లివర్ వ్యాధులనేవి ఒక సైలెంట్ కిల్లర్ అన్నారు. కాలేయ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఎక్కువసేపుఏ కూర్చు నేవారు, ఒబేసిటీ, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, పిసిఓడి, హైపోథైరాయిడిజం, సిర్రోసిస్, హెపటైటిస్, ఫ్యాటి లివర్ వంటి కాలేయ వ్యాధులు నిర్ధారణ, అనుమానం ఉన్నావారు, కుటుంబంలో ఎవరికైనా కాలేయ క్యాన్సర్, హెపటైటిస్ లాంటి వ్యాధులు ఉంటే అటువంటి వారు తప్పకుండా లివర్ స్క్రీనింగు పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనికోసం నారాయణ ఆసుపత్రి యాజమాన్యం ముందస్తు కాలేయ స్క్రీనింగు పరీక్షల కోసం ఏర్పాట్లు చేశామన్నారు. ఆగస్టు 1నుంచి 31వరకు, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ ప్రత్యేక ప్యాకేజీ అందుబాటులో ఉంటుందన్నారు. డాక్టర్ కన్సల్టేషన్ ఫీజుతోపాటు రూ.3600 విలువ కలిగిన వైద్య పరీక్షలు కేవలం రూ.1500లకే అందిస్తున్నామని తెలిపారు. ముందస్తు పరీక్షలు చేయించుకుంటే మందులతో వ్యాధిని తగ్గించుకోవచ్చన్నారు. అపాయింటుమెంటు కోసం 7331170063, 9640100555 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి హరిప్రసాద్‌రెడ్డి, డిజిఎం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపలో ఆనందాన్ని చూస్తున్నాం



**ఆత్మకూరు, జులై29ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో ఆనందాన్ని చూస్తున్నామని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రిని ఆశీర్వదిస్తున్నారని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎపిఎస్ఆర్ కాలనీ సచివాలయ పరిధిలో 19,20 వార్డుల్లో ఎమ్మెల్యే ముమ్మరంగా పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ప్రతి కుటుంబానికి ఆర్థికాభివృద్ధికి అందజేసిన సంక్షేమ పథకాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు.

**అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం** ఆత్మకూరు మున్సిపల పరిధిలోని 9వ వాడర్డు అనంతరాయని ఏనికి చెందిన నలుగురు రైతులకు చెందిన గడ్డివాములు దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఒక్కొక్కరికి 10వేల రూపాయలను అందజేశారు. ఎ.జ్యోతి, టి.బుజ్జమ్మ, టి.వెంకటేశ్వర్లు, బి.పెంచలయ్యలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయని, తమను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన 10వేల రూపాయల వంతున ఆర్థికసాయం అందజేశారు. దీంతో నాయకులు, బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

**గంధమహోత్సవానికి 50వేలు** అందజేత మున్సిపల్ పరిధిలోని ప్రముఖ దర్గా అయిన శ్రీ సుల్తాన్‌షాహిద్ దర్గాలో జరిగే గంధమహోత్సవంలో అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి 50వేలు అందజేశారు. గంధమహోత్సవ సభ్యులైన అబ్దుల్ రహీం, కలాం, ముజీబ్, మహబూబ్‌బాషా, సర్దార్, రిజ్వాన్, అబ్దుల్లాలకు 50వేల రూపాయల చెక్కును అందజేసి గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే సొంత నిధులు అందజేయడం పట్ల కమిటీ సభ్యులు, నాయకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, పట్టణ జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ షేక్ సర్దార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు సాయినగర్‌లో సీసీ రోడ్డు మంజూరు



**కందుకూరు జూలై 29, ప్రభాతవార్త కందుకూరు** పట్టణంలోని సాయినగర్ 8వలైన్ సమీపంలో ఎట్టకేలకు సీసీ రోడ్డు మంజూరు చేశారు. సుమారు 125మీటర్లు దూరంలో సీసీ రోడ్డునిర్మాణానికి రూ.10.05లక్షలు కేటాయించారు. ఈ మేరకు పనులు గుత్తేదారు జాజుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ పనులను శనివారం మునిపల్ డీఈ బి.శ్రీరామమూర్తి పరిశీలించారు. గత ఐదేళ్లగా నెలకొన్న సమస్యపరిష్కారానికి కృషిచేసిన శాసనసభ్యులు ఎం.మహీధర్‌రెడ్డికి, మునిసిపల్ కమీషనర్ మనోహర్‌కి ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు చెప్పున్నారు. వివరాల్లోకి వెళితే..గత నాలుగేళ్ల కిందటే అప్పటి మునిసిపల్ కమీషనర్ కె.అనూషాతోపాటు కమీషనర్ మనోహర్‌కు సచివాలయ అధికారులుకు ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు లేనందున ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. అప్పటిలో పరిసర ప్రాంతాలలో సీసీ రోడ్లువేశారు. ఈ రోడ్డును వదిలేశారు. తదుపరి సమస్య తీవ్రతను స్దానిక శాసనసభ్యులు మహీధర్‌రెడ్డికి వివరించారు. దీంతో నిధుల లభ్యత మేరకు త్వరలో సీసీ రోడ్డు వేయిస్తామని మునిసిపల్ కమీషనర్ మనోహర్ ఎండార్సుమెంటు ఇచ్చారు. ఈ నేపధ్యంలో తాజాగా సీసీ రోడ్డు మంజూరు చేయడం, పనులు ప్రారంభించడం, డీఈ శ్రీరామమూర్తి పనులు పరిశీలించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ నిబంధనల మేరకు నిర్ణీత ప్రమాణంలో సీసీ రోడ్డు వేయాలని పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నిర్వహకులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్యామ్‌కుమార్‌తోపాటు పలువురు ఉన్నారు.

# పచ్చి బియ్యం విదేశీ ఎగుమతులపై కేంద్రంపై ఒత్తిడి



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పచ్చి బియ్యం విదేశీ ఎగుమతులను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా రైతు పక్షపాతి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా పార్లమెంట్ , రాజ్యసభ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి. నిరంజన్‌బాబురెడ్డి శనివారం వినతిపత్రం అందజేశారు. నెల్లూరులోని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిలను ప్రత్యేకంగా కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి బియ్యం విదేశీ ఎగుమతులను నిలివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లోనూ, రాజ్యసభలోనూ ఈ సమస్యపై వారు చర్చించాలన్నారు. ఇందుకు వారు స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా తగు చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత టి. చంద్రశేఖర్, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# దుకాణాల స్టాల్స్‌లో నాణ్యతను తనిఖీ చేసిన కమీషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్,జూలై 29, ప్రభాతవార్త** బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ల వద్ద అమ్ముతున్న తినుబండారాలు, ఇతర ఆహార పదార్థాలను, మంచినీటి కేంద్రాల్లో నీటి పీపీఎం నాణ్యతను కమీషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. భక్తులకు అందిస్తున్న మంచినీటిని పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీటి శిబిరాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాడి పడేసిన కవర్లు, పేపర్లు ప్రాంగణంలో కనిపించకుండా శుభ్రం చేయాలని, దర్గా పరిసరాలు మొత్తం ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే దర్గా లోపలి విక్రయిస్తున్న ఐస్‌క్రీమ్ దుకాణాలు, పానీ పూరి దుకాణాల్లోని తినుబండారాల నాణ్యతను కమీషనర్ స్వయంగా పరీక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, విక్రయదారులకు కమీషనర్ సూచించారు. అదే విధంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం జరపరాదని కమీషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 50 లక్షల రూపాయల విలువ కల్గిన వంద కేజిల గంజాయి పట్టివేత




**కావలి, జూలై 29 ప్రభాతవార్త** గంజాయి అక్రమ రవాణా, విక్రయదారుల ఆటకట్టించి కావలి పోలీసులు 50 లక్షల రూపాయల విలువ చేసే వంద కేజిల గంజాయిని పట్టుకొని 19 మందిని అరెస్ట్ చేసి జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించారు. గంజాయి అక్రమ రవాణాదారుల గుండెల్లో కావలి పోలీసులు దడ పుట్టించారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి డిఎస్పీ వెంకట రమణ పట్టుకున్న గంజాయిని చూపిస్తూ వివరాలు వెల్లడించారు. గంజాయి రహిత నెల్లూరు జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిఘా బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేసి గంజాయి ముఠా ఆటకట్టిస్తున్నామన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ డి.హిమవతి పర్యవేక్షణలో కావలి డిఎస్పీ వెంకట రమణ ఆధ్వర్యంలో కావలి రూరల్ సిఐ యం.రాజేష్, రూరల్ ఎస్ఐ సుమన్, పోలీస్ బృందంతో శనివారం ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఒక కారులో 50 లక్షల రూపాయల విలువ కల్గిన వంద కేజిల గంజాయిని 50 ప్యాకెట్లలో తరలిస్తుండగా ముసునూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. ఆంధ్రా,ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి బెంగుళూరు సిటీకి గంజాయి ప్యాకెట్లు కారులో అక్రమంగా తరలిస్తుండగా ఆకస్మిక దాడులు చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. గంజాయి తాగినా, అమ్మినా, రవాణా చేసినా, సాగు చేసినా కఠిన చర్యలు గైకొండం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరికలు చేశారు. గంజాయి కేసులలో శిక్షలు కఠినతరమన్నారు. పట్టుబడితే జీవితాలు సర్వనాశనమన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల పట్ల అప్రమత్తంగా వుంటూ నిఘా పెంచుకోవాలన్నారు. కళాశాలలకు వెళ్తున్న తమ పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారిని మంచి మార్గంలో పెట్టాలని తల్లిదండ్రులకు డిఎస్పీ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా 'యువత మేలుకో-భవితను మలుచుకో-డ్రగ్స్‌ను వదులుకో' అనే నినాదంతో టోల్‌ఫ్రీ నెంబరు 14500ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

**గంజాయి ముఠా అరెస్ట్...** బెంగుళూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న, విక్రయిస్తున్న ముఠాలకు సంబంధించి 19 మందిని అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. కేరళ రాష్ట్రం కన్నూరు తలసేరికి చెందిన అబ్దుల్ సాజిద్, పరాతాయిల్ అమర్‌నాథ్, కావలి పట్టణ శాంతినగర్‌కు చెందిన కొప్పోలు సుమంత్‌కృష్ణ వేణు, కావలి పట్టణ వాయునందన ప్రెస్ వీధికి చెందిన కోక్కు సాయి సునీల్, కావలి పట్టణ బాపూజీనగర్‌కు చెందిన కేతిరెడ్డి యుగనేష్, కావలి పట్టణ వెంగళరావునగర్‌కు చెందిన బీమ సుమన్, నెల్లూరు పట్టణం కుద్దూస్‌నగర్‌కు చెందిన షేక్ షమీర్, ఇందుపూరుపేట కోడూరుపాడు గ్రామానికి చెందిన అరవ ఓంరేష్, నెల్లూరు సిటీ కపాడిపాళెంకు చెందిన ఎస్.కె.సత్తార్, ఎస్.కె.పషూర్, నెల్లూరు సిటీ వెంగళరావునగర్‌కు చెందిన సాతూరి తిరుమల, నెల్లూరు సిటీ శ్రీముఖనగర్‌కు చెందిన ఇరకం రాజా, నెల్లూరు సిటీ జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన ఎస్.కె.బబ్లూ, నెల్లూరు ఓల్డ్ చెక్‌పోస్టు శెట్టిగుంట రోడ్డుకు చెందిన కయ్యరపు సతీష్, నెల్లూరు సిటీ ఆమదానగర్‌కు చెందిన నాగల పోలయ్య, కలిగిరికి చెందిన ఈస జయరాములు, బోగోలు మండలం అల్లిమడుగు సంఘంకు చెందిన గోగుల శ్రావణి, పోకూరు గ్రామానికి చెందిన నల్లగట్ల అరుణమ్మ, కందుకూరు రాంనగర్‌కు చెందిన నల్లగట్ల నాగరాజులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు డిఎస్పీ తెలిపారు. కేరళ రాష్ట్రానికి చెందిన నజీల్, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బబ్లూలు పరారులో వున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యం.రాజేష్, రూరల్ ఎస్ఐ సుమన్‌లు పాల్గొన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అల్లూరు, జూలై 29 ప్రభాతవార్త** గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం అల్లూరు మండల పరిధిలోని తూర్పుగోగులపల్లిలో చేపట్టారు. ముందుగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేసి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఎక్కువ మందికి అందజేసింది ఒక్క జగనన్న ప్రభుత్వమని తెలిపారు. అర్హులైన వారందరూసచివాలయంలోని వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు పొందవచ్చునని తెలిపారు. రాబోయే రోజుల్లో జగనన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్, సర్పంచ్ తోట శ్రీహరి, పవన్‌కుమార్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఉస్మాన్ షరీఫ్, గోళ్ళ ఆదామ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.